ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 289 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 26 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




## నిఘా నీడలో
# దేశ రాజధాని

### కట్టుదిట్టంగా పరేడ్ పరిసరాలు
### 15000 మంది పోలీసుల మోహరింపు..
### 70 కంపెనీల పారామిలటరీ బలగాలు

**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రభాత ఉదయం):** గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ రాజధాని నిఘా నీడలో ఉన్నది. దేశ రాజధాని రిపబ్లిక్‌డే వేడుకలకు ముస్తాబవుతున్న తరుణంలో ఎలాంటి భద్రతా లోపాలూ తలెత్తకుండా ఉండేందుకు 70 కంపెనీలకు పైగా పారామిలటరీ బలగాలు, 15,000 మందికి పైగా పోలీసులను మోహరించడంతో పాటు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. సెక్యూరిటీ సిబ్బంది ఎక్కువగా ఉండటంతో పాటు డ్రోన్లు, సీసీటీవీ నిఘా, సైబర్ స్పెషలిస్టులతో నగర పర్యవేక్షణ ఉంటుంది. వేడుకలను సజావుగా నిర్వహించేందుకు ఆరు లేయర్ల తనిఖీలు, ఫ్రిస్కింగ్‌లతో బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్ (ఎఫ్‌ఆర్‌ఎస్)తో సహా వేలాది సీసీటీవీ కెమెరాలు, ప్రాంతాలను పర్యవేక్షించడానికి మొబైల్ ఎఫ్‌ఆర్‌ఎస్-అనుకూల వాహనాలను న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు అనుమానాస్పద వ్యక్తులను వెంటనే గుర్తించడం కోసం క్రిమినల్ డేటాబేస్‌కు లింక్ చేయబడతాయి. పోలీసు బృందాలు పలు ఏజెన్సీలతో మాక్ డ్రిల్‌లు నిర్వహిస్తున్నాయి. అన్ని జిల్లాల డీసీపీలకు సమాచారమందించామనీ, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. "మేము ఇప్పటికే బహుళ లేయర్డ్ భద్రతా ఏర్పాట్లను చేశాం. మా వద్ద ఆరు పొరల తనిఖీ, ఫ్రిస్కింగ్ ఏర్పాట్లు ఉన్నాయి. ఇది కాకుండా, మేము బహుళ లేయర్డ్ బారికేడింగ్ ఏర్పాటు చేశాం. న్యూఢిల్లీ జిల్లాలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్‌తో సహా వేల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశాం" అని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. న్యూఢిల్లీ, ఉత్తర, మధ్య జిల్లాల్లో దాదాపు 4,000 రూఫ్‌టాప్ సెక్యూరిటీ పాయింట్లను ..మిగతా 2లో

## నేటి నుంచే ఆ నాలుగు
# పథకాలకు శ్రీకారం

### గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక
### అర్హుల్లో ఒక్కరికి అన్యాయం జరగొద్దు..అనర్హులకు చోటు దక్కొద్దు
### పథకాల అమలుపై అధికారులు, మంత్రులతో సిఎం రేవంత్ సమీక్ష
### గ్రామానికో అధికారి చొప్పున పథకాల అమలుకు ఆదేశాలు



**హైదరాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం):** గతంలో హామీ ఇచ్చిన విధంగా ఆదివారం నుంచి నాలుగు కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో ఆయన పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజమైన లబ్దిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగవద్దని సూచించారు. అనర్హులకు లబ్ది చేకూరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలను తెలంగాణ సర్కార్ లాంఛనంగా ప్రారంభించనుంది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నాలుగు పథకాలకు ఒక్కో పథకానికి ఒక్కో అధికారి చొప్పున గ్రామానికి నలుగురు మండలస్థాయి అధికారులను నియమించాలని తెలిపింది. ఫిబ్రవరి మొదటివారం నుంచి మార్చి 31లోగా రాష్ట్రంలోని మిగతా గ్రామాల్లో లబ్దిదారులకు పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మార్చి 31 లోపు నాలుగు పథకాలు వంద శాతం అమలు జరిగేలా చూడాలి.. నిజమైన లబ్దిదారులకు ఒక్కరికి కూడా అన్యాయం జరగొద్దు.. అనర్హులకు లబ్ది చేకూరిస్తే అధికారులపై చర్యలు తప్పవని సర్కార్ హెచ్చరించింది. సంక్షేమ పథకాల కోసం లక్షలాది దరఖాస్తులు వచ్చాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల వెరిఫికేషన్ కోసం గ్రామసభలు నిర్వహించామని, ఇచ్చిన హామీ మేరకు రేపటి నుంచి పథకాల ప్రారంభిస్తామన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. పవిత్రమైన గణతంత్ర దినోత్సవం రోజున ఇచ్చిన మాట ప్రకారం నాలుగు పథకాలు ప్రారంభిస్తున్నామన్నారు. మండలానికి ఒక గ్రామం ..మిగతా 2లో



## వైభవంగా
# నాగోబా జాతర

### భక్తుల రాకతో కేస్లాపూర్ కిటకిట

**ఆదిలాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం):** ఆదివాసీల ఆరాధ్య దైవం, మెస్రం వంశీయుల కులదైవమైన కేస్లాపూర్ నాగోబా భక్తుల పూజలు అందుకోనున్నాడు. వారం రోజులపాటు భక్తుల రాకతో కేస్లాపూర్ కిటకిటలాడనుంది. పుష్య అమావాస్య రోజున అర్ధరాత్రి పవిత్ర గంగాజలంతో నాగోబా అభిషేకం తర్వాత మహాపూజ ప్రారంభించి నాగోబా జాతర ప్రారంభం కానుంది. అందుకోసం మెస్రం వంశీయులు ఈనెల 10వ తేదీన కేస్లాపూర్ నుంచి గంగాజల పాదయాత్ర చేపట్టి వందల మైళ్ళు కాలినడకన గోదావరిలోని హస్తలమడుగు వద్దకు చేరుకుంది. పవిత్ర గంగాజలాన్ని సేకరించి తిరుగు ప్రయాణంలో ముందస్తుగా చేపట్టిన ఆచార సాంప్రదాయాల్లో మొదటి ప్రధాన ఘట్టాన్ని పూర్తిచేసుకుని ఇంద్రవెల్లిలో ఇంద్రాదేవికి మహాపూజ నిర్వహించారు. ఆపై కాలినడకన పవిత్ర గంగాజలంతో మెస్రం వంశ పెద్దలు వారి వెంట మేస్రం వంశ కుటుంబాలు ..మిగతా 2లో

## కేంద్రం నిధులిస్తోంది..
# మోడీ ఫోటో పెట్టాల్సిందే

### ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకునేది లేదు
### రేషన్ కార్డులపైనా ప్రధాని ఫోటో ఉండాల్సిందే
### లేకుంటే ఉచిత రేషన్ పంపిణీని ఆపేస్తాం
### కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక

**కరీంనగర్, జనవరి 25 (ప్రభాత ఉదయం):** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకు 'ఇందిరమ్మ' పేరు పెడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ పేరు పెడితే కేంద్ర ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరు పెడితేనే నిధులు ఇస్తామన్నారు. కాంగ్రెస్ ఫొటోలు పెడితే రేషన్ కార్డులు ఇవ్వబోమన్నారు. తామే ..మిగతా 2లో





## రాజ్యసభకు
## విజయసాయి
# రాజీనామా

### ఆమోదించిన ఛైర్మన్ జగదీప్ ధన్కడ్
### వైకాపాతో విభేదాలు లేవన్న విజయసాయి
### తనలాంటి వారు ఎందరు వెళ్లినా జగన్ ప్రభతగ్గదని వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రభాత ఉదయం):** వ్యక్తిగత కారణాలతోనే వైకాపా రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని విజయసాయిరెడ్డి తెలిపారు. జగన్‌కు విషయం తెలిపే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని అన్నారు. తనలాంటి వారు ఎందరు బయటకు వెళ్లినా జగన్‌కు వచ్చిన నష్టం లేదన్నారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు రాజీనామా లేఖ సమర్పించానని.. దాన్ని ఆయన ఆమోదించారని చెప్పారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. 'ఇంకా మూడున్నరేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ రాజీనామా చేశాను. రాజీనామా మాత్రమే కాదు.. రాజకీయాల నుంచి కూడా వైదొలగాలని నిర్ణయించుకున్నాను. వైకాపా 2019లో 151 స్థానాలు సాధించింది. 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి 40 శాతం ఓటింగ్ వచ్చింది. జగన్ అత్యంత ప్రజాదరణ గల ..మిగతా 2లో

## చీనాబ్ వంతెనపై
# పరుగులు పెట్టిన వందేభారత్ రైలు



### విజయవంతమైన ట్రయల్ రన్స్

**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రభాత ఉదయం):** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన అయిన చీనాబ్ బ్రిడ్జ్‌పై వందేభారత్ రైలు పరుగులు పెట్టింది. ఈ వంతెనపై శనివారం వందేభారత్ రైలు ఫస్ట్ ట్రయల్ రన్స్ నిర్వహించారు. ట్రయల్ రన్స్‌లో భాగంగా శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా స్టేషన్ నుంచి శ్రీనగర్ స్టేషన్ వరకూ వందే భారత్ రైలు పరుగులు పెట్టింది. కాగా, ఇప్పటికే సెమీ హైస్పీడ్ వందే భారత్ రైళ్లు దేశ వ్యాప్తంగా పలు మార్గాల్లో దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. దీంతో మరిన్ని మార్గాలకు ఈ రైళ్లను కేంద్ర విస్తరిస్తోంది. ఈ క్రమంలోనే ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్‌లో కశ్మీర్ నుంచి న్యూఢిల్లీకి ..మిగతా 2లో



## మోహన్ భగవత్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి

**జీడిమెట్ల సిఐ కి ఫిర్యాదు చేసిన ఎన్ఎస్‌యు ఐ నాయకులు గొల్ల జాన్**

కుత్బుల్లాపూర్, జనవరి 25 (ప్రభాత ఉదయం) మోహన్ భగవత్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల సీఐ మల్లేష్ కు తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్, తెలంగాణ విద్యార్థి నాయకులు ఫిర్యాదు చేశారు. మన స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను అవమానిస్తూ, దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ రామ మందిర ప్రతిష్ఠాపన సమయంలోనే భారతదేశం"నిజమైన స్వాతంత్ర్యం"సాధించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. సంఘ్ యొక్క పునర్మార్పిడి చర్యలు లేకుండా ఆదివాసీలు "దేశ వ్యతిరేకులు"అనే అతని వ్యాఖ్యలు వారి గౌరవంపై దాడి చేస్తాయి. మత అసహనాన్ని ప్రోత్సహిస్తాయి. కాబట్టి, భగవత్ దేశద్రోహ చర్యలపై విద్వేషాన్ని ప్రోత్సహించడం, మన ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడం కోసం ఆయనపై పోలీసు ఫిర్యాదులు చేయాలని ఎన్ ఎస్ యు ఐ తెలంగాణ నాయకులందరినీ కోరుతున్నామని అన్నారు. మన రాజ్యాంగాన్ని, జాతీయ సమగ్రతను కాపాడుకోవడానికి ఐక్యంగా నిలబడదాంమని ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి ఆదేశాల మేరకు మోహన్ భగవత్‌పై పోలీసు చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల పీఎస్ సీఐ మల్లేష్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్ ఎస్ యుఐ నాయకులు, ఎం.సాయి కిరణ్, విశ్వ, యువజన కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్, విజయ్, భానుగౌడ్, కుషవల్, సాయి, హరీష్ ఎన్ ఎస్ యు ఐ యువకులు పాల్గొన్నారు.

## కేంద్రం నిధులిస్తోంది.. మోడీ ఫోటో పెట్టాల్సిందే

మొదటి పేజీ తరువాయి...

ముద్రించి ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మాజీ సీఎం కేసీఆర్ మీద ఆయన విమర్శలు గుప్పించారు. కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందేనని అన్నారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకపోతే ఉచిత బియ్యం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు భాజపాలో చేరిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. 'ఎప్పుడు ఎన్నికలు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్ భాజపాదని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చినా గత పదేళ్లలో ఏనాడూ భారాస నేతలు నన్ను పిలవలేదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు నేను నిధులు తీసుకొస్తే.. వాళ్లు పనులు ప్రారంభించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిధులను దారిమళ్లిస్తే.. కొట్లాడి మరీ అడ్డుకున్నానని అన్నారు. కరీంనగర్ కోసం ఎంత కష్టపడినప్పటికీ నన్ను ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా దూరంపెట్టారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులతోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగిందని ప్రజలకు అర్థమైంది. భారాస పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయింది. మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారు' అని బండి సంజయ్ దుయ్యబట్టారు. రేవంత్‌కు గురువు కేసీఆరేనని బండి సంజయ్ అన్నారు. 'రేవంత్‌కు కేసీఆరే గురువు. కేసీఆర్ ఏం చేశారో.. రేవంత్ అదే చేస్తున్నారు. రేవంత్ పనిలో కొత్తదనం ఏమీ లేదు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? కాళేశ్వరం అవినీతి ఎక్కడకు పోయింది? కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడం లేదు? రేపే అరెస్ట్ అని ఇంకా ఎన్ని రోజులు అంటారు? ఫార్ములా కారు రేసు కేసులో కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? గ్రీన్ కో కంపెనీ నుంచి కాంగ్రెస్‌కు డబ్బులు ముట్టాయ్. దావోస్‌కు రెండుసార్లు పోయినా.. పెట్టుబడులపై స్పష్టత లేదు. శ్వేత పత్రం విడుదల చేయాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## చీనాబ్ వంతెనపై పరుగులు పెట్టిన వందేభారత్ రైలు

మొదటి పేజీ తరువాయి...

అనుసంధానించే వందే భారత్ రైలును ఈ ఏడాది ప్రారంభించేందుకు కేంద్ర సిద్ధమైంది. మొత్తం 272 కిలోమీటర్ల మేర ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టును నిర్మించారు. ఈ లింక్ ప్రాజెక్ట్ దాదాపు పూర్తైంది. కత్రా, రిసియా మధ్య కొంత మేర పెండింగ్‌లో ఉంది. ఇది మరికొన్ని రోజుల్లోనే పూర్తి కానుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాక రైళ్లు రియాసి జిల్లాలోని అంజి వంతెన, చీనాబ్ వంతెన ద్వారా ఉధంపూర్, జమ్ము, కాట్రా గుండా వెళతాయి. సంగల్దాన్, బనిహాల్ మీదుగా నేరుగా శ్రీనగర్, బారాముల్లా చేరుకుంటాయి. దీంతో రోడ్డు మార్గంతో పోలిస్తే ఆరు గంటలు ఆదా అవుతుంది. ప్రయాణం కూడా చాలా సులభతరం. ఇక కశ్మీర్ లోయ వరకూ సౌకర్యవంతంగా ప్రయాణాన్ని అందించేందుకు ఈ మార్గంలో నడిచే మొదటి రైలుగా వందేభారత్‌ను ఎంపిక చేశారు. ఇందులో భాగంగానే ఈ రైలుకు ప్రత్యేక ఫీచర్లు అనుసంధానించారు. కశ్మీర్ లోయలో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటాయి. దీంతో బయట విపరీతమైన మంచు కురుస్తున్నా లోపల ఉన్న ప్రయాణికులు వెచ్చదనాన్ని ఆస్వాదించేలా ఈ రైలును రైల్వే శాఖ ప్రత్యేకంగా రూపొందించింది. తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా రైల్లోని నీరు గడ్డకట్టకుండా ఉండేందుకు అధునాతన వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. ఇక వందేభారత్ టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కశ్మీర్‌కు కేవలం రూ.1,500 నుంచి రూ.2100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, శ్రీమాతా వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉండనున్నట్లు సమాచారం.

## రాజ్యసభకు విజయసాయి రాజీనామా

మొదటి పేజీ తరువాయి...

నాయకుడు. నాలాంటివాళ్లు వెయ్యి మంది వీడినా ఆయనకు ఉన్న ఆదరణ తగ్గదనేది నా ఉద్దేశం. రాజీనామా నిర్ణయాన్ని లండన్ పర్యటనలో ఉన్న జగన్‌కు ఫోన్‌లో వివరించాను. వైకాపాకు 11 మంది ఎమ్మెల్యేల బలమే ఉంది. నా రాజీనామాతో కూటమి లబ్ధి పొందుతుంది' అని విజయసాయిరెడ్డి అన్నారు.అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు విజయసాయిరెడ్డి సమాధానమిచ్చారు. 'సుదీర్ఘ రాజకీయ జీవితంలో నాకు తెలిసి ఏరోజూ అబద్ధాలు చెప్పలేదు. హిందూ ధర్మాన్ని, వెంకటేశ్వరస్వామిని నమ్మిన వ్యక్తిగా అబద్ధాలు చెప్పను. వైఎస్ కుటుంబంతో నాలుగు దశాబ్దాలుగా అనుబంధముంది. వైఎస్ రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జగన్.. ఇలా మూడు తరాలుగా ఆ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారితో విభేదాలు లేవు.. భవిష్యత్తులోనూ రావు. 2011 ఆగస్టు 10న ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. ఆ కేసుల్లో అప్రూవర్‌గా మారాలని ఎంత బలవంతపెట్టినా నిరాకరించాను. దైవాన్ని నమ్మిన వ్యక్తిగా నమ్మకద్రోహం, మోసం చేయడం నాకు తెలియదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాపై కాకినాడ సీపోర్టుకు సంబంధించిన కేసు పెట్టారు. లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఈడీ విచారణకు హాజరయ్యాను. కేవీ రావుతో సన్నిహిత సంబంధాలు, వ్యాపార లావాదేవీలు లేవని చాలా స్పష్టంగా చెప్పాను. కేవీ రావు చెప్పేది నిజమైతే ఆయన తన పిల్లలపై ప్రమాణం చేయాలి. కేసు పెట్టాకే కాకినాడ సీపోర్టు లావాదేవీల విషయం తెలిసింది. విక్రాంత్‌రెడ్డితో నాకున్న పరిచయం తక్కువ. నాకు ఏ వ్యాపారాలు లేవు.. నేను దేనిలోనూ భాగస్వామిని కాదు. 365 రోజులూ పార్టీ కోసమే పనిచేశా. వ్యాపార లావాదేవీలపై నాతో మా వియ్యంకుడు ఏరోజూ చర్చించలేదు. కుటుంబ వ్యవహారాలు బాగుండాలంటే ఆర్థిక, వ్యాపార లావాదేవీలు ఉండకూడదని బలంగా నమ్ముతానని అన్నారు. రాజకీయాల నుంచి తప్పుకొంటే ఇంకా బలహీనుడిని అవుతాను. అలాంటప్పుడు కేసులు ఎందుకు మాఫీ చేస్తారు?నన్ను ఎందుకు తప్పిస్తారు? నేను రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు వేరు. రాజ్యసభ ఎంపీగా అటు రాష్ట్రానికి, ఇటు పార్టీకి న్యాయం చేయలేను. నాకంటే శక్తి సామర్థ్యాలు ఉన్న వ్యక్తులు రాజ్యసభకు వస్తే రాష్ట్రానికి ఉపయోగ పడతారనే కారణంతో రాజీనామా నిర్ణయం తీసుకున్నాను. నాకు ఎవరిపైనా కోపంలేదు.. రాజీనామాలో ఎవరి ఒత్తిడీ లేదు. ఎవరికీ భయపడే తత్వం నాది కాదు. దేన్నైనా ధైర్యంగా ఎదుర్కొంటాను'అని విజయసాయిరెడ్డి అన్నారు.

# భారత గణతంత్ర దినోత్సవ వేళ పద్మపురస్కారాలు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 24 (ప్రభాత ఉదయం): భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం శనివారం పద్మ పురస్కారాలను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ప్రతిష్టాత్మక అవార్డులకు కేంద్రం ఎంపిక చేసింది. అవార్డులకు ఎంపికైన వారిలో ఒకరు విదేశీయులు ఉన్నారు. బ్రెజిల్‌కు చెందిన వేదాంత గురు జోనస్ మాశెట్టి, కువైట్‌కు చెందిన షేకా ఏజే అల్ సబాహ్, నేపాల్‌కు చెందిన నరేన్ గురుంగ్ సైతం పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. పద్మ అవార్డులను పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అనే మూడు కేటగిరిల్లో కేంద్రం అందిస్తుంది. కళలు, సమాజ సేవ, ప్రజా సంబంధాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వాణిజ్యం, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలతో పాటు వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారిని అవార్డులకు ఎంపిక చేస్తారు. ప్రతి ఏటా రిపబ్లిక్ డే సందర్భంగా పద్మ అవార్డులను ప్రకటిస్తూ వస్తున్నారు.




**పద్మ అవార్డులు వచ్చింది వీరికే..**

జరోనస్ మాశెట్టి.. బ్రెజిల్, వేదాంత గురువు
షేఖా ఏజే అల్ సబాహ్, కువైట్, యోగా
నరేన్ గురుంగ్, నేపాల్, జానపద గాయకుడు
హర్వీందర్‌సింగ్, హర్యానా, పారా ఒలింపియన్ గోల్డ్‌మెడల్ విన్నర్
భీమ్ సింగ్ భవేష్, బిహార్, సామాజిక కార్యకర్త
పి దక్షిణా మూర్తి, పుదుచ్చేరి, డోలు విద్వాంసుడు
ఎల్ హంగ్‌థింగ్, నాగాలాండ్, వ్యవసాయం
బేరు సింగ్ చౌహాన్, మధ్యప్రదేశ్, జానపద గాయకుడు
హరిమన్ శర్మ, హిమాచల్ ప్రదేశ్, ఆపిల్ సాగుదారుడు
జుమ్దే యోమ్‌గామ్ గామ్లిన్, అరుణాచల్ ప్రదేశ్, సామాజిక కార్యకర్త
విలాస్ దాంగ్రే, మహారాష్ట్ర, హోమియోపతి వైద్యుడు
వెంకప్ప అంబాజీ సుగటేకర్, కర్ణాటక, జానపద గాయకుడు
నిర్మలా దేవి, బిహార్, చేతి వృత్తులు
రాధా బహిన్ భట్, ఉత్తరాఖండ్, సామాజిక కార్యకర్త
జోయ్నచరణ్ బతారీ, అసోం, థింసా కళాకారుడు
సురేశ్ సోనీ, గుజరాత్, సోషల్‌వర్కర్
పాండి రామ్ మాండవి, ఛత్తీస్‌గఢ్, కళాకారుడు
లిబియా లోబో సర్దేశాయ్, గోవా, స్వాతంత్య సమరయోధురాలు
గోకుల్ చంద్రదాస్, పశ్చిమ బెంగాల్, కళలు
సల్లీ హోల్కర్, మధ్యప్రదేశ్, టెక్స్‌టైల్స్
మారుతీ భుజరంగ్‌రావు, మహారాష్ట్ర సాంస్కృతికం-విద్య
బతూల్ బేగమ్, రాజస్థాన్, జానపద కళాకారురాలు
వేలు ఆసన్, తమిళనాడు, డప్పు వాద్యకారుడు
భీమవ్వ దొడ్డబాలప్ప శిల్లేక్యాతర, కర్ణాటక, తోలుబొమ్మలాట
పర్మార్ లావ్జీభాయ్ నాగ్జీభాయ్, గుజరాత్, చేనేత
విజయలక్ష్మి దేశ్‌మానే, కర్ణాటక, వైద్యం
చైత్రం దేవ్‌చంద్ పవార్, మహారాష్ట్ర, పర్యావరణ పరిరక్షణ

# ఎక్సైజ్ ఆధ్వర్యంలో వాహనాల వేలం

**ఎక్సైజ్ శాఖ నిర్వహించిన వేలంలో**
**రూ.2,49,800 పలికిన 17 ద్విచక్ర వాహనాలు**

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి25(ప్రభాత ఉదయం)గద్వాల ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో అధికారులు వివిధ నేరాల్లో పట్టుకున్న 19 ద్విచక్రవాహనాలకు శనివారం ఎక్సైజ్ సిఐ గణపతిరెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో కొంతమంది రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. కాగా, వేలంలో 17 ద్విచక్ర వాహనాలను విక్రయించగా రూ.2,49,800 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు సీఐ గణపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనాల వేలంపాట నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ గణపత్ రెడ్డి



వాహనాల వేలంపాటలో పాల్గొన్న కొనుగోలుదారులు

## నేటి నుంచే ఆ నాలుగు పథకాలకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి...

యూనిట్‌గా తీసుకొని నాలుగు పథకాలు అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి పథకాలు అందిస్తామని, మార్చి వరకు పక్రియ పూర్తి చేస్తామని భట్టి స్పష్టం చేశారు. పథకాల్లో ఎలాంటి సీలింగ్ లేదని, అర్హులందరికీ అందిస్తామన్నారు. ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎక్కువ దరఖాస్తులు వచ్చాయన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఒక్కరికి రైతు భరోసా ఇస్తామని భట్టి వివరించారు. నాలుగు కొత్త పథకాలు ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించామని చెప్పారు. గ్రామాల్లో పథకాల కోసం లక్షల అప్లికేషన్లు వచ్చాయన్నారు. నవరి 26 నుంచి ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తామని చెప్పారు. వ్యవయసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా ఇస్తామన్నారు. రేషన్ కార్డుల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు మంత్రి ఉత్తమ్. రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని తెలిపారు. ఒక్కో వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేపు నాలుగు సంక్షేమ పథకాలు మండలంలోని ఒక గ్రామంలో మధ్యాహ్నం 1 గంటలకు లాంఛనంగా ప్రారంభిస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ.. గతంలో దరఖాస్తు ఇచ్చినా, సర్వేలో వివరాలు ఇచ్చినా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోక పోయినా ఇప్పుడు ప్రజాపాలన కేంద్రాల్లో ఇవ్వండని అన్నారు. బీపీఎల్ కుటుంబాలందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించిందని పేర్కొన్నారు. గత పదేళ్ళుగా దొడ్డు బియ్యం ఇచ్చారు.. మనిషికి ఆరు కిలోల సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపై బయట ఆహార పదార్థాలు కొనుక్కోవాల్సి ఉండదని అనుకుంటున్నానన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భారతదేశంలో రికార్డు స్థాయిలో పంటలు పండించింది తెలంగాణ రైతాంగం అని అన్నారు. దేశంలోనే రూ.7525 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. 21వేల కోట్ల రైతు రుణమాఫీ, 3వేల కోట్ల రైతు భీమా కట్టామని తెలిపారు. రేపట్నుంచి రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానాన్ని రైతు భరోసా అమలు చేయబోతున్నా మని అన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఒక్కరికీ రైతు భరోసా ఇస్తున్నాం.. 40 వేల కోట్లు ఒక్క సంవత్సరంలోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి, గద్వాల కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత**



న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కవితా దేవి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు




బాల్య వివాహాల నిర్మూలన పై రూపొందించిన పోస్టర్ ను విడుదల చేస్తున్న న్యాయసేవా సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి, గద్వాల కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత జిల్లా న్యాయమూర్తి పూజిత

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి25(ప్రభాత ఉదయం) బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి, గద్వాల కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత పేర్కొన్నారు. శనివారం కేటిదొడ్డి మండలం పాగుంట గ్రామంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "వద్దు మాకు పెళ్లి - బడికి పోతాం మేం" అనే పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 18 ఏళ్ల లోపు ఆడపిల్లలు, 21 ఏళ్లలోపు మగ పిల్లలకు పెళ్లిళ్లు చేయడం నేరమన్నారు. అలా చేసిన వారికి 2 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 1 లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయటం వలన వారు శారీరకంగా మానసికంగా అనేక రకమైన అనారోగ్య సమస్యలకు గురవుతారన్నారు. బాలికలకు మంచి విద్యనందిస్తే, అనేక రకమైన అవకాశాలు ఉన్నాయాన్ని, వారికి అవకాశాలిస్తే ఏమైనా సాధించగలరు అని అన్నారు. 18 సంవత్సర లోపు పిల్లలను బడి మానించి పనులకు పంపించవద్దు అని, పిల్లలను ప్రతి రోజు బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ పాగుంట గ్రామం నుండి కొండాపురం హై స్కూల్ కు వెళ్తున్న పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మండలంలో ఉపాధ్యాయుల కొరత కూడా చాలా ఉందని, వెంటనే ఉపాధ్యాయులను కూడా నియమించాలని వినతిపత్రం అందించారు. ఎంవిఎఫ్ ఆధ్వర్యంలో పాగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెమిడీయల్ తరగతిని పరిశీలించి పిల్లల పోర్ట్ఫోలియోలు, టిఎల్ఎం మెటీరియల్, నెమలిక పుస్తకాలను పరిశీలించి పిల్లలతో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో కేటిదొడ్డి మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, సీఆర్పీ యుగంధర్, ప్రధానోపాధ్యాయులు రఘురాం, ఉపాధ్యాయులు,ఎంవిఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, మండల కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, తదితరులు, పాల్గొన్నారు.

## వైభవంగా నాగోబా జాతర

మొదటి పేజీ తరువాయి...

ఎడ్లబండ్లతో కుటుంబ సమేతంగా కేస్లాపూర్ లోని మర్రిచెట్ల వద్దకు చేరుకున్నారు. శనివారం నుంచి రెండు రోజులపాటు మర్రిచెట్ల వద్దనే బస చేసి సాంప్రదాయ ఆచార కార్యక్రమాలను కొనసాగిస్తారు. ఈనెల 28వ తేదీ నాడు కేస్లాపూర్ లోని నాగోబా ఆలయ ప్రాంగణంలోని గోవాడ వద్దకు చేరుకుని, గంగాజలంతో నాగోబా ఆలయానికి మెస్రం వంశీయులు చేరుకుంటారు. ఆలయ శుద్ధి తర్వాత అర్ధరాత్రి నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించి మహాపూజ ప్రారంభించనున్నారు. అనంతరం నాగోబా జాతర ప్రారంభం కానుంది. నాగోబా జాతర ఏర్పాట్లపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఎండోమెంట్ అధికారులు,ఇతర జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై అధికారులు పనులు పూర్తి చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా నాగోబా జాతరకు సంబంధించిన పరిసర ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. మర్రిచెట్టు ప్రాంతం, కోనేరు, గోవాడ్, తై బజార్, స్టాల్స్, దేవాలయ ప్రాంతం, తదితర ప్రాంతాలలో చేపడుతున్న పనులను పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లు, చేపట్టవలసిన పనుల వివరాలను వివిధ శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు.

**త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలి..**

**జిల్లా కలెక్టర్ రాజార్షి షా**

ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆయా ముఖ్యమైన శాఖలకు సంబంధించిన విధులను షిఫ్ట్ ల వారిగా కేటాయించడం జరిగిందనీ, వారం రోజుల పాటు జరిగే నాగోబా జాతరలో సంబంధిత అధికారులు విధులు నిర్వహించడం జరుగుతుందనీ అన్నారు. ముఖ్యమైన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని, ప్రశాంతంగా దైవదర్శనం చేసుకొని, తిరుగు ప్రయాణం చేసేంతవరకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## నిఘా నీడలో దేశ రాజధాని

మొదటి పేజీ తరువాయి...

గుర్తించారు. పరేడ్‌కు హాజరైనవారికి భద్రతా స్టిక్కర్‌లను అందిస్తారు. పరేడ్ మార్గం, పరిసర ప్రాంతాలలో ఎఫ్ఆర్ఎస్‌తో దాదాపు 500 అధిక రిజల్యూషన్ తో కూడిన ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఢిల్లీ పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మూడు జిల్లాల డీసీపీలు రూట్ సర్వేలు, తనిఖీలు, రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంచారు. శాంతిభద్రతల పరి రక్షణకు ప్రత్యేక మార్గాలు, డ్రోన్ పర్యవేక్షణ, సీసీటీవీ నిఘా ఉంటుం దన్నారు. సంసిద్ధతను నిర్ధారించడానికి హౌటల్స్, మాల్స్ భద్రతా సిబ్బందితో ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించామని చెప్పారు.

# ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షోరూంలో అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదం జరిగిన ఎలక్ట్రికల్ స్కూటి ల షోరూమ్ ఉన్న నలంద నగర్ ప్రాంతం..


తగులబడిన ఎలక్ట్రిక్ స్కూటీ లు


షో రూం నిర్వాహకులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో

బుద్వేల్, జనవరి25(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ నలందనగర్ లో ఉన్న ఓ ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్ లో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 21 బైక్‌లతో పాటు పది వరకు ద్విచక్ర వాహనాల బ్యాటరీలు, ఫర్నీచర్, తగులబడిపోయింది. షోరూమ్ నిర్వాహకులు, స్థానికుల సమాచారం మేరకు రాజేంద్రనగర్, లంగర్ హౌజ్ ఫైర్ స్టేషన్లకు చెందిన రెండు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... అత్తాపూర్ కు చెందిన అరవింద్, జియాగూడ కు చెందిన మంతాటి న ర్సింహులు పార్టనర్షిప్ లో బాపూఘాట్ సమీపంలోని నలందనగర్ లో స్టార్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ లో ఏడీఎంఎస్ ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్ నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 10-30 గం టలకు సేల్స్ మేనేజర్ కిరణ్ వచ్చి షోరూమ్ ను తెరిచాడు. అదే అపార్ట్మెంట్ లో ఉండే వెం కటయ్య అనే కార్మికుడు వచ్చి షోరూమ్ ను శుభ్రం చేసి వెళ్లిపోయాడు. ఆ తర్వాత సేల్స్ మేనేజర్ కిరణ్ షోరూమ్ గ్లాస్ డోర్ ను దగ్గర చేసి తాళం వేసుకుని పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్ లో టిఫిన్ చేయడానికి వెళ్ళాడు. అంతలోనే ఏడిఎం ఎస్ ఎలక్ట్రికల్ షో రూం లో దట్టమైన పొగలు వచ్చాయి. లోపల ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనాలు తగులబడిపోయి మంటలు వ్యాపించాయి. మూడంతస్థులు ఉన్న షోరూమ్ భవనం లో వెంటనే కరెంటు పోయింది. దట్టమైన పొగలు వస్తుండటంతో మొదటి అంతస్థులో ఓ సంస్థ ప్యామిలీ డే వేడుకలను నిర్వహిస్తుండటం, అందులో రెండు వందల మంది వరకు ఉండటంతో వారు భయపడి మెట్లపైనుంచి క్రిందికి వచ్చేశారు. అప్పటికే షోరూమ్ సేల్స్ మేనేజర్ కిరణ్ రావడం, మంటలు వ్యాపించడంతో స్థానికులు, కిరణ్ కలసి 100కు డయల్ చేశారు. అనంతరం ఫైర్ స్టేషన్ కు పోన్ చేయగా, రాజేంద్రనగర్ ఫైర్ ఆఫీసర్ చంద్ర నాయక్, అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ ల ఆద్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు, మంటలు ఎక్కువగా ఉండటంతో లంగర్ హౌజ్ ఫైర్ స్టేషన్ నుంచి కూడా ఫైరింజన్ ను రప్పించి మంటలను పూర్తిగా అర్పివేశారు. ఈ ప్రమాదంలో 21 ఎలక్ట్రికల్ స్కూటీలు పూర్తిగా తగులబడిపోయాయి. రిపైర్ కు ఉన్న 10 బ్యాటరీలు కూడా పేలి పోయాయి. ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయింది. సంఘటన స్థలానికి రాజేంద్రనగర్ ఇన్ స్పెక్టర్ క్యాస్ట్రో వెళ్లి వివరాలు సేకరించారు.

**షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది. : షోరూమ్ యజమాని మంతాటి నర్సింహులు :**

ఒకటిన్న సంవత్సరాలుగా బాపూఘాట్ సమీపంలో స్టార్ ఎంటర్ప్రైజెస్ పేరుతో నేను, అరవింద్ అనే ఇద్దరం కలసి ఏడీఎంఎస్ ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్ నిర్వహిస్తున్నాము. షోరూమ్ లో ఆరు రకాల ఎలక్ట్రికల్ స్కూటీలు 21 ఉన్నాయి. పది వరకు బ్యాటరీలు ఉన్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల శనివారం ప్రమాదం జరిగి ఉండవచ్చని బావిస్తున్నాం. రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. సీసీ కెమెరాల పుటేజీ ని బట్టి నిజానిజాలు తెలిసే అవకాశం ఉంది. ఒక్కోక్క ఎలక్ట్రికల్ స్కూటి రూ. 1. 5 లక్షల నుంచి రెండు లక్షల వరకు ఉంటుంది. మొత్తం రూ. 50లక్షల వరకు నష్టం జరిగింది. బాదితుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో ఆధ్వర్యంలో ఎస్ఐ ఎ.భానుమతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


డి ఈ రత్నాకర్ రావుకు నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను అందజేస్తున్న అందజేస్తున్న 1104 యూనియన్ నాయకులు

## ఉద్యోగులు ప్రభుత్వ ఆకాంక్షలను ప్రజల ముందు తీసుకెళ్లాలి:

### డి ఈ రత్నాకర్ రావు

రాజేంద్రనగర్, జనవరి 25(ప్రభాత ఉదయం) ప్రభుత్వ ఆకాంక్షలను ప్రజల ముందుకు ఉద్యోగులు తీసుకెళ్లి ప్రజలకు మేలు జరిగే విధంగా పనిచేయాలని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డి ఇ పి రత్నాకర్ రావు అన్నారు. శనివారం శివరాం పల్లి లోని విద్యుత్ కార్యాలయంలో రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డి ఈ పి రత్నాకర్ రావుకు విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం రాజేంద్రనగర్ డివిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2025 డైరీ, క్యాలెండర్ ను అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ రావు ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు అనంతరం రత్నాకర్ రావు మాట్లాడుతూ.. విధినిర్వాణలో ఉద్యోగులు, ఇబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసే వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు ఏ శ్రీహరి రావు, ప్రధాన కార్యదర్శి ఎం ఏ అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి శ్రీనివాస్, అడిషనల్ సెక్రటరీ రమణ, కోశాధికారి వి వరప్రసాద్, సంఘం రాష్ట్ర వర్కింగ్ నాయకుడు బాబురావు, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరావు, మణిరాం, యాదయ్య, వి రాజారామ్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు బి శ్యాంసుందర్ సింగ్, సీనియర్ అసిస్టెంట్ మల్లేశం, జే పద్మనాభ భం, మహేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

### అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ కె .రవి కుమార్


ఓటు హక్కు వినియోగించుకుంటాం అని ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

బుద్వేల్, జనవరి25(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరం ఓటు హక్కును వినియోగించుకుంటాం అంటు ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది అందరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేము ఓటు వేయడమే కాకుం డ మాకు తెలిసిన వారందరికి చెప్పి ఓటు వేయిస్తామని తెలిపారు. ఓటు హక్కు ద్వారా సమాజ స్థితిగతులను మార్చవచ్చని. మంచి పరిపాలకులను ఎన్నుకొనవచ్చని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాజేద్రనగర్ సర్కిల్ ఆర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ విభాగం డిప్యూటి ప్రాజెక్టు ఆఫీసర్ యాదగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు 76వ గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు


క్రిస్టీనా గ్రేస్..



రాక్ చర్చ్ మహిళా సభ్యులు

బుద్వేల్, జనవరి 25 (ప్రభాత ఉదయం): నగర ప్రజలకు రాక్ చర్చికి చెందిన మహిళా ప్రతినిధులు సిస్టర్ జయమ్మ, సిస్టర్ షీలా, సిస్టర్ నిర్మల, సిస్టర్ విమల, రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన సిస్టర్ బి శాలిని, సిస్టర్ ఏ. మాధవి లు 75వ భారత గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులకు క్రిస్టినా గ్రేస్ శుభాకాంక్షలు తెలిపారు.

## సామాజిక ఉద్యమ నేతకు పద్మశ్రీ అవార్డు


పద్మశ్రీ అవార్డు కు ఎంపికైన మంద కృష్ణ మాదిగ

బుద్వేల్, జనవరి 25(ప్రభాత ఉదయం): ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయనకు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్ తో పాటు వికలాంగులకు పెన్షన్ల పెంపు, చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయించడం, వితంతువులకు పెన్షన్ల పెంపు లాంటి అనేక సామాజిక ఉద్యమాలను నడిపి విజయం సాధించిన మందకృష్ణ మాదిగ ప్రజాసేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ ప్రకటించడం సంతోషకరమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వనం నరసింహ మాదిగ, మదిలేటి మాదిగ, గుంటి సురేష్ మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగ, పోతురాజు యాదయ్య మాదిగ, ననాగారి రామచందర్ మాదిగ లు అన్నారు. మాదిగ జాతి ముద్దుబిడ్డగా మంద కృష్ణ మాదిగ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు 30 సంవత్సరాలుగా ఎన్నో అడ్డంకులు ఎదురైనా అలుపెరగని పోరాటం చేసి సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనముతో అనుకూలంగా తీర్పు చెప్పించడానికి మంద కృష్ణ మాదిగ చేసిన కృషి ఎంతో ఉన్నతమైనది అన్నారు. భవిష్యత్తులో మంద కృష్ణ మాదిగ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 7వ తేదీలోగా ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించడానికి జీవో విడుదల చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు.



## నేడు గగన్ పహాడ్, కాటేదాన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, జనవరి 25(ప్రభాత ఉదయం) కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధి లో ఆదివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన అంబికా ఫుడ్, రాజా ఆగ్రో ప్రాంతం, కట్టే దాని పారిశ్రామిక వాడ, మధ్యాహ్నం 12 గంటల నుండి ఒంటిగంట వరకు కల్పనా మెటల్స్, విశ్వకర్మ ఇండస్ట్రీ, బసప్ప హెూటల్, హనుమాన్ టెంపుల్ ప్రాంతం, కాటేదాన్ పారిశ్రామిక వాడ, మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకు దిశా ఫుడ్స్ ప్రాంతం, అంబికా ఫుడ్స్, కాటేదాన్ పారిశ్రామిక వాడ, రెండు గంటల నుండి మూడు గంటల వరకు ఏసియన్ బ్యారెల్స్, ఐఎంఈ గోడౌన్స్, హర్ష బేకర్స్ యూనిట్ 1,2, నీతూ మెటల్ కంపెనీ, మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు గోటి కంపెనీ, ఇందు ఆయిల్ మిల్, డేటెడ్ మెటల్ కేన్స్, కేడి ఆగ్రో ఏరియా, ఓస్వాల్ రబ్బర్ కంపెనీ, సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు గంగోత్రి విద్యుత్తు ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పారిశ్రామిక వాడ, గణేష్ నగర్, అమ్మ గార్డెన్, పైనియర్ స్కూల్, బాబా టెంట్ హౌస్, షమా టెంట్ హౌస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**గగన్ పహాడ్ లో...**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని గగన్ పహాడ్, మీనాక్షి, జై భవాని, శాతం రాయి పారిశ్రామిక వాడ విద్యుత్ ఫీడర్ల ప్రాంతాలైన గగన్ పహాడ్ ప్రధాన రహదారి, గగన్ పహాడ్ గ్రామం, శాతం రాయి గ్రామం, పారిశ్రామిక వాడ కొంత ప్రాంతం, మీనాక్షి దారి ,జై భవాని దారి, ప్రాంతాలలో శనివారం ఉదయం 11 గంటలకు నుండి ఒంటిగంట వరకు, రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, పాహిల్ ఫుడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సర్వీసింగ్ గల్లి, ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కొంత ప్రాంతంలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.


### చిన్నారులలో మేధస్సును నింపడానికే

## సైన్స్ ఎగ్జిబిషన్: పి.జగన్మోహన్రెడ్డి


సైన్స్ ప్రదర్శనలో చిన్నారులు


ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ పి. జగన్మోహన్ రెడ్డి, పి. అనితా రెడ్డి లు




అడవుల సంరక్షణ కు సంబంధించిన ప్రదర్శన

బుద్వేల్, జనవరి25(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ లో శనివారం అర్ట్, క్రాఫ్ట్, సైన్స్, సోషల్ స్టడీస్, లాంగ్వేజెస్, మ్యాథమెటిక్స్ అండ్ జనరల్ ఎగ్జిబిషన్ ను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.జగన్మోహన్ రెడ్డి, , పి అనితారెడ్డి ల అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు ఎనిమిది వందల మంది విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్ లో పాల్గొని తమ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యమే మహా భాగ్యం. అడవుల పరిరక్షణ. చెట్ల వలన కలిగే లాభాలు. నీటి పొదుపు తదితర విభాగాలలో ప్రదర్శనలు చేపట్టారు. చిన్నారులు చేసిన వివిధ రకాల ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రంగాలలో అవగాహన కల్పించి చైతన్యం చేయడానికే ఈ సైన్స్, ఆర్ట్, సైన్స్, సోషల్, మ్యాథమెటిక్ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. విద్యార్థులు ఎంతో చక్కగా ప్రదర్శనలను నిర్వహించారని, వారందరికి ప్రోత్సాహక బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు.

## లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం: కోరని సదానంద్


డప్పు కొట్టి దండోరా వేస్తున్న బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చ కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్

బుద్వేల్, జనవరి25(ప్రభాత ఉదయం): ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోరని సదానంద్ అన్నారు. ఇదే అంశంపై ఫిబ్రవరి 7వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ నాయకత్వంలో నగరంలో చేపట్టనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమంలో ప్రతి మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన వ్యక్తులు. ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్న వివిధ వర్గాల ప్రజలు పాల్గొని మద్దతు ప్రకటించాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమంలో పాల్గొంటామన్నారు.

## ప్రతి ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: కలెక్టర్ సంతోష్





గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి25(ప్రభాత ఉదయం)15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుంటామని జిల్లా అధికారులు, ఉద్యోగులతో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ప్రతిజ్ఞ గావించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఏ ఓ వీరభద్రప్ప స్వీప్ నోడల్ అధికారి రమేష్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హైదర్ గూడ శ్మశాన వాటికను సందర్శించిన ఏ ఈ రాజేష్

బుద్వేల్, జనవరి25(ప్రభాత ఉదయం): హైదర్ గూడ స్మశాన వాటికను శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ రాజేష్ పరిశీలించారు. నెల రోజుల క్రితం ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజా భవన్ లో హైదర్ గూడ బస్తీవాసులు స్థానిక స్మశానవాటికలో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరుతు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పేరుతో వినతి పత్రం అందజేశారు. హైదర్ గూడ బస్తీ వాసులు అడిగిన విన్నపాలను ప్రజా పాలన నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ కార్యాలయానికి రావడంతో శనివారం ఏఈ రాజేష్ హైదర్ గూడ స్మశానవాటికి కు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సోమారం రవీందర్, వనం నర్సింహ్మా మాదిగ, సోమారం రాజ్ కుమార్, ఎం.బాలసుబ్రమణ్యం, శ్రీకాంత్, బాలమురళీక్రిష్ణ, శ్రీనివాస్, బాస్కర్, చంద్రయ్య లు ఏఈ రాజేష్ కు స్మశానవాటికలో కావల్సిన సదు పాయల గురించి వివరించారు. స్మశానవాటిక చుట్టురా కాంపౌండ్ వాల్ నిర్మించాలని, స్ట్రీట్ లైట్లు వెలిగేటట్లు చూడాలని, కూర్చోవడానికి కుర్చీలు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలని కోరారు. దానికి కావాల్సిన అంచవాలను ఏఈ రాజేశ్ ఆద్వర్యంలో తీసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టేలా చూస్తామని తెలిపారు. అదికారులు వచ్చి శ్మశాన వాటిక ను పరిశీలించి పనులు చేయడానికి అంచనాలు తీసుకోవడం పట్ల హైదర్ గూడ బస్తీ వాసులు హరం వ్యక్తం చేసారు. త్వరగా పనులు చేపట్టేలా చూస్తామని తెలిపారు. అదికారులు వచ్చి స్మశానవాటిక ను పరిశీలిం చి పనులు చేయడానికి అంచనాలు తీసుకోవడం పట్ల హైదర్ గూడ బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు.



## ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపు రావాలంటే ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కావాలి

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్


కుత్బుల్లాపూర్, జనవరి (ప్రభాత ఉదయం) ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపు రావాలంటే ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి సంక్షేమం, అభివృద్ధికై పనిచేయాలి అని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం పదవి కాలం పూర్తయిన సందర్భంగా పాలకవర్గం సభ్యులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశానికి కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, ప్రజా నాయకులు కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై పాలకవర్గం సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపు రావాలంటే ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్.అంబేద్కర్ ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించారు

## మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్

కొత్తకోట, జనవరి 25(ప్రభాత ఉదయం) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజలకు ధైర్యంగా ఓటు వేసే హక్కును కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ సంఘం అధ్యక్షులు జనంపల్లి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీ నాయకులు పూలమాలవేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ... దేశ రాజకీయ భవిష్యత్తు ఓటర్ల చేతుల్లో ఉందని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకొని వినియోగించు కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గొల్ల బాబు, మాజీ జెడ్పిటిసి డాక్టర్ పి జె బాబు,జిల్లా కాంగ్రెస్ కార్యద ర్శులు. బోయేజ్, కృష్ణారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి, మాజీ సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీఎస్పీ పార్టీ నాయకులు డేవిడ్ రాజ్, అయ్యన్న, గాడిల ప్రశాంత్, జెడి.సంపత్, జేకే. రాజు,నాగభూషణం, ఎస్.డి లాల్, జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు

# ప్రతి రైతు పండించిన వరి పంటకు బోనస్ అందేలా చూడాలి

## బి ఆర్ ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు

కొత్తకోట, జనవరి 25(ప్రభాత ఉదయం) ప్రతి రైతు పండించిన వరి పంటకు బోనస్ ప్రభుత్వం నుంచి అందాల చూడాలని బి ఆర్ ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు కోరాలు. శనివారం కొత్తకోట మండల తాసిల్దార్ కు బి ఆర్ ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... రైతులు పండించిన సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని గతంలో పండించిన సన్న వడ్లకు కొంతమంది రైతులకే బోనస్ అందిందని, మిగతా రైతులకు కూడా పూర్తిస్థాయిలో బోనస్ ఇవ్వాలని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఇవ్వాలని లేని పక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ ప్రజల పక్షాన రైతుల పక్షాన ఉంటూ వారి మేలు కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాను ఎమ్మార్వో కి ఇచ్చిన వినతి పత్రం లో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, మాజీ సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి,కౌన్సిలర్ అయ్యన్న ,మాజీ సర్పంచులు లక్ష్మణ్ నాయక్, బాలు నాయక్, రాములు, అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదగిరి, బి ఆర్ ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు పసుపుల నెహ్రు , యూత్ నాయకులు సతీష్ ,ప్రశాంత్ ,నరసింహ, మహేష్, ఎల్లంపల్లి శేఖర్ రెడ్డి, రాజకుమార్, వహిద్, శ్రీనివాస్ తదితర నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.




రామకృష్ణాపురం గ్రామంలో ఓటు హక్కుపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేపిస్తున్న ఉపాధ్యాయులు

# ప్రజాస్వామ్యానికి పునాది ఓటు

కొత్త కోట, జనవరి 25(ప్రభాత ఉదయం) ఓటు హక్కు పొందడం ప్రతి పౌరుని బాధ్యత అని, 18 సంవత్సరాల నిన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని ప్రజలకు సూచించారు. శనివారం ప్రపంచ ఓటర్ దినోత్సవ సందర్భంగా కొత్తకోట మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఉపాధ్యాయులు ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరు తమ తమ ఓటును బాధ్యత పరంగా పూర్తి స్వేచ్ఛగా మీ ఓటును న్యాయం వైపు నడిపించాలని సూచించారు. ప్రపంచ ఓటర్ల దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు.

# మహిళ సజీవ దహనం

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 25(ప్రభాత ఉదయం) ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకోవడంతో ఓ మహిళ సజీవ దహనమైంది. ఈ ఘటన గద్వాల మండలం కొండపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ అలియాస్ కిష్టమ్మ (68) కొన్నేండ్ల నుంచి పూరి గుడిసెలో ఒంటరిగానే జీవిస్తోంది. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకోవడంతో ఆ మహిళ గుడిసెలో సజీవ దహనం అయింది. శుక్రవారం రాత్రి గ్రామంలో చలి ఎక్కువ కావడంతో మృతురాలు గుడిసె ముందు చలిమంటలు పెట్టుకుందని, ఆతర్వాత గుడిసెలో నిద్రపోయింది. గాలికి చలి మంటల నుంచి నిప్పులు చెలరేగి గుడిసె దగ్ధం కావడంతో గుడిసెలో నిద్రిస్తున్న అ మహిళ సజీవ దహనం అయినట్లు, గ్రామస్తులు, పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గద్వాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి: కలెక్టర్ సంతోష్



ప్రతిజ్ఞ చేపిస్తున్న కలెక్టర్ సంతోష్



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

## దేశ భవిష్యత్తు ఓటర్ల చేతుల్లో ఉంది

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 25 (ప్రభాత ఉదయం): దేశ భవిష్యత్తు ఓటర్ల చేతుల్లో ఉన్నందని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకొని సక్రమంగా వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కాంప్లెక్స్ నుండి కృష్ణవేణి చౌక్ వరకు నిర్వహించిన ఓటర్ల అవగాహన ర్యాలీకి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో అధికారులు,విద్యార్థులు పాల్గొని ప్లే కార్డులు చేతబట్టి మన ఓటు %-% మన హక్కు, ఓటు ఈజ్ యువర్ వాయిస్ వంటి నినాదాలతో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటర్ నమోదు చేయించి, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు అనేది పౌరుడి హక్కు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తివంతమైన ఆయుధమని అన్నారు. మీ అభిప్రాయం ప్రభుత్వానికి చేరాలంటే, పాలసీ మేకింగ్‌లో మీ వంతు పాత్ర ఉండాలంటే , ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు.నేటి విద్యార్థులే రేపటి పౌరులు, అందుకే వారిలో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించాడం జరిగింది. ప్రతి పౌరుడి బాధ్యతలో ప్రధానమైనది ఓటరుగా నమోదు కావడం, ఓటు హక్కును వినియోగించుకోవడమని తెలిపారు.ఓటు వేయడం ద్వారానే మీ వాయిస్ ను ప్రభుత్వానికి చేరవచ్చు," అని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 17 ఏళ్లు నిండినవారికి ఓటరుగా నమోదు అయ్యే అవకాశం కల్పించిందని అన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుకోవాలని,ఆన్‌లైన్‌లో కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని, బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికీ వచ్చి ఈ ప్రక్రియను సులభతరం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ప్రదేశంలో ఓటింగ్ అందుబాటులో ఓటు హక్కును అందరికీ చేరువ చేయడానికి ప్రభుత్వం దూర ప్రాంతాలు, దీవులు, లేదా అందుబాటులోకి రానివంటి ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని గుర్తు చేశారు. జిల్లా లోని గుర్రం గడ్డ గ్రామం వంటి దివి ప్రాంతాల్లోకి బోట్ లైన్ల ద్వారా ఓటర్లను చేరుకోవడం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఇంత కృషి చేస్తున్నా, పట్టణ ప్రాంతాల్లో చాలా మంది ఓటు వేయడానికి ముందుకు రావడం లేదు,పల్లెల్లో ఓటింగ్ శాతం మంచి స్థాయిలో ఉన్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని తమ హక్కును వినియోగించుకోవాలని అన్నారు. మీరు ఎక్కడ ఉన్నా ఎన్నికల సమయంలో కచ్చితంగా ఓటు వేయాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యతగా పేర్కొంటూ, అందరూ ఓటర్లుగా నమోదు చేసుకుని అవగాహన పెంపొందించి, తమ ఓటు హక్కును వినియోగించడం ద్వారా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం కావాలని అన్నారు.ఆ తర్వాత, ర్యాలీలో పాల్గొన్న అందరూ ఓటర్ ప్రమాణం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖ మరియు స్వీప్ నోడల్ అధికారి రమేష్ బాబు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సరోజ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య ఎవరి సొత్తు కాదు విద్యవల్లే ఉన్నత స్థానం: ఎమ్మెల్యే జిఎంఆర్

## విద్య తోనే సమాజాభివృద్ధి

కొత్తకోట, జనవరి 25(ప్రభాత ఉదయం) విద్య ఎవరి సొత్తు కాదని విద్య వల్లే ఉన్నత స్థానాలకు చేరుకోగలమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట మండలం అముడబాకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు 50 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ , సైకిల్ ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం మేస్ చార్జీలు పెంచి మెరుగైన వసతులతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు మంచి భోజన వసతులు కల్పిస్తూ ఆ దిశగా విద్యార్థుల కొరకు ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నా సొంత ఖర్చుల నుండి 20 లక్షల,రూపాయలతో తయారుచేసిన క్యూఆర్ కోడ్ స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలకుఎంతగానోఉ పయోగపడతాయని ప్రైవేట్ పాఠశాల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇస్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలో పల్లెల నుండి రెండు,మూడు, కిలోమీటర్ల దూరం నుండి నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులకు కోసం కోజేట్,కంపెనీ ద్వారా సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఎక్కువగా సెల్ ఫోన్ చూస్తూ టైంపాస్ చేస్తున్నారని చదువు పట్ల శ్రద్ధ కలిగి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సి డి సి చైర్మన్ గొల్ల బాబు, ఎంఈఓ కృష్ణయ్య, మాజీ జెడ్పిటిసి డాక్టర్ పి జె బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్,ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రావుల కర్ణాకర్ రెడ్డి, సుభాష్, సంధ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్ళు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

# సోదరి సకలమ్మకు నివాళులు అర్పించిన మాజీ సీఎం కేసీఆర్



మాజీ సీఎం కేసీఆర్ సోదరి సకలమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్



సోదరి సకలమ్మ పార్థివ దేహం పై పుష్పాలు ఉంచి నివాళులు అర్పిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

మేడ్చల్, జనవరి 25(ప్రభాత ఉదయం) మాజీ సీఎం కేసీఆర్ తన సోదరి సకలమ్మకు నివాళ్లు అర్పించారు. శనివారం మేడ్చల్ మండలంలోని మునిరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ సోదరి సకలమ్మ అంతిమయాత్రలో పాల్గొని సంతాపాన్ని వ్యక్తం చేసిన మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి . ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ... సకలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# మున్సిపాలిటీలు అభివృద్ధి చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు రామాంజనేయులు



కేంద్ర ప్రభుత్వం ప్రజలతో చేపట్టనున్న అభివృద్ధి పనుల శిలాఫలకం వద్ద బిజెపి నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి25(ప్రభాత ఉదయం)జిల్లాలోని మున్సిపాలటీలు నిధుల లేమితో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయని, ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని, జనాభాకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం 2.0 కింద నిధులు కేటాయించడంతో ఆయా పట్టణవాసులకు తాగునీటి సరఫరా లక్ష్యంగా కేంద్రప్రభుత్వం అమృత్ 2.0 పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం గద్వాలలోని నదీ అగ్రహారం ఫిల్టర్ బెడ్ వద్ద ప్రారంభించిన అమృత్ 2.0 పథకం శిలాఫలకాని గద్వాల బీజేపీ నాయకులు సందర్శించారు. అనంతరం డీకే బంగ్లాలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... భవిష్యత్తులో 100%తాగు నీటి భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం ప్రవేశపెట్టిందని అన్నారు.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో శాశ్వత మంచినీటి కొరత ఉండకూడదనే ఉద్దేశంతో గద్వాల మున్సిపాలిటీకి అమృత్ 2.0 స్కిం కింద రూ. 63.25 కోట్లు కేటాయించడం జరిగిందని అందులో కేంద్ర ప్రభుత్వం రూ. 28.75 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.34.50 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. అమృత్ 2.0 పంప్ హౌస్ నిర్మాణం పూర్తయితే గద్వాల మున్సిపాలిటి పరిధిలో మరో 50 సంవత్సరాల వరకు త్రాగునీటి సమస్య తలెత్తదన్నారు. అధికార పార్టీ నాయకులు పట్టణ అభివృద్ధి లో రాజకీయం చేయడం మానుకోవాలని, గద్వాల పట్టణ అభివృద్ధి కి అందరు కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి శ్రీనివాసులు,కౌన్సిలర్లు త్యాగరాజు ,బండల పద్మావతి,రజక జయ శ్రీ, గుర్రం నరసింహులు, శ్రీ రాములు, బండల పాండు ,జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ, బిజెపి సీనియర్ నాయకులు చిత్తారి కిరణ్ ,అనిల్ ఢిల్లీవాలా క్రిష్ణ, ఎస్సై పవన్ తదితరులు ఉన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేస్తున్న రెడ్డి బిజినెస్ గ్రూప్ ప్రతినిధులు

# ఘనంగా రెడ్డి బిజినెస్ గ్రూప్ పంచమ వార్షికోత్సవం

హైదరాబాద్, జనవరి 25(ప్రభాత ఉదయం) హైద రాబాదులో జరిగిన రెడ్డి బిజినెస్ గ్రూప్ పంచమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి .వేలమంది రెడ్డి సోదరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి,లోకేంద్ర రెడ్డి,కె ఎస్ రెడ్డి, టిఎన్జీఓ అధ్యక్షుడు, శివానంద రెడ్డి,నేక్ డైరెక్టర్ ఎం.రాజిరెడ్డి (స్కిల్ డెవలప్మెంట్ అథారిటీ), కొవ్వూరు సురేష్ రెడ్డి (క్రియేటివ్ మెంటార్స్ అధినేత, సంజీవరెడ్డి, సోమనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలోని సీనియర్ అసిస్టెంట్‌లకు నాయబ్ తహశీల్దార్లుగా పదోన్నతి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి25(ప్రభాత ఉదయం) జిల్లాలోని రెవెన్యూ శాఖలో పని చేస్తున్న 5 మంది సీనియర్ అసిస్టెంట్ లకు నాయబ్ తహసీల్దార్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. శివకుమార్, ఎం.కరుణాకర్, పి.ప్రశాంత్ గౌడ్, జి.ఉదయ్ కిరణ్, అజిత్ కుమార్ లను నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ముగ్గురు అరెస్ట్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి25(ప్రభాత ఉదయం) పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురుని అదుపు లోకి తీసుకున్నట్లు గద్వాల సీఐ టంగుటూరి శ్రీను తెలిపారు. శనివారం గద్వాల సీఐ మాట్లాడుతూ కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గద్వాల్ సీఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,000 నగదు, 3 మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గద్వాల సీఐ తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608